మొక్కుబడి

తండ్రి ఆఫీసునుంచి వచ్చి వీధి వరండాలో సైకిలుకి స్టాండు వేస్తుంటే గబగబా పరుగెత్తుకొని వెళ్లింది మూడు సంవత్సరాల రోహిణి.

"నాన్నగారూ! నా పట్టీలు చూడండి!" అంది మురిసిపోతూ. కూతురి మాటలు విన్పించుకోని భాస్కరం తిన్నగా తన గదిలోకి వెళ్లి వాలు కుర్చీలో కూర్చున్నాడు. తండ్రి వెనుకనే గదిలోకి వెళ్లింది రోహిణి గబగబా అడుగులు వేసుకుంటూ. పట్టీలకున్న మువ్వలు సవ్వడి చేస్తూంటే రోహిణి ఆనందానికి హద్దుల్లేవు. తండ్రి కెదురుగా నిలబడి కుడి పాదాన్ని పైకెత్తి చూపిస్తూ

"అమ్మ పట్టీలు చేయించింది!" అంది ఉత్సాహంగా.

ఆ పట్టీలను చూసి ఆశ్చర్యపోయాడు భాస్కరం. కూతుర్ని వడిలో కూర్చుండ బెట్టుకొని పట్టీలను సవరిస్తూ అడిగాడు "ఎప్పుడు చేయించింది!" అని.

"నేనూ అమ్మ సాయింత్రం షాపుకెళ్లి తెచ్చుకొన్నాం. అక్కడ నెక్లెసులూ, గొలుసులూ, ఉంగరాలు చాలా ఉన్నాయ్ నాన్నగారూ! నాకూ ఒక గొలుసుకొనరూ!" గారాలు పోయింది రోహిణి.

"పాత వెండిచ్చి పట్టీలు చేయించాను! బావున్నాయా?" కాఫీ గ్లాసుతో గదిలోకి ప్రవేశిస్తూ అడిగింది భాస్కరరావు భార్య పార్వతి.

"పాత వెండా?" ఆశ్చర్యంగా అడిగాడు.

కోడలు వెనుకనే వస్తూ జవాబిచ్చింది భాస్కర్ తల్లి అనసూయమ్మ.

"దాని తమ్ముడు పెళ్లికి వచ్చిన ఉత్తర జంధ్యాలు దొంగ వేళంగిన్నీ అవీ ఇచ్చి చేయించింది బాబూ! ఎదురింటి ప్లీడరుగారమ్మాయి పట్టీలు చేయించుకొన్న

దగ్గరనుంచీ నీ కూతురు ఒకటే పేచీ పట్టీలు కావాలని! నేనే చేయించమన్నా!"

దొంగ వేలాంగిన్నీ, ఉత్తరజంజాలు కలసి రెండు తులాలు కూడా ఉండవ్. పట్టీలు చూస్తుంటే నాలుగు తులాలుంటాయ్! భాస్కరానికి అనుమానం తీరలేదు. అదే అడిగాడు.

"ఆరెండు కలిస్తే తులంన్నర కూడా ఉండవుకదమ్మా!" అన్నాడు

"మీ నాన్నగారి వుద్ధరిణి కూడా వేశాం!" అని భార్య చెప్పటంతో చికాకు వేసింది భాస్కరానికి. అసమ్మతిగా, ఆగ్రహంగా కొడుకు, కోడలి వైపు చూస్తుంటే సర్దిచెప్పాలనుకొంది అనసూయమ్మ.

"నేనే అలా చేయమన్నా బాబూ! ఉద్ధరిణి అక్కడ ఇక్కడా పడేస్తే కొన్నాళ్లకు మరచిపోతాం! పోయినాకుడా తెలియదు! వెండి ధర మండిపోతోంది! పిల్ల సరదాతీరుతుంది!

"నాన్నగారి జ్ఞావక చిహ్నంగా అదొక్కటే మిగిలిందమ్మా! అలా చేస్తారనుకోలేదు!"

భర్త చికాకు పార్వతికి కోపం తెప్పించింది.

"అక్కడఅక్కడా దొర్లుతుంది, పోతుందని మీ అమ్మగారు చేయించమంటే చేయించా! అంతేగాని మీ అమ్మాయి సింగారం కోసంకాదు!" చురచురలాండింది.

"అదికాదు పార్వతీ! నన్నడిగితే డబ్బిచ్చేవాడిని కదా! అనవసరంగా దాన్ని చెరిపించి పాడుచేశారు! దాన్ని చూసినప్పుడల్లా నాన్నగారు జ్ఞాపకానికి వచ్చేవారు!

"నీ తండ్రి జ్ఞాపకాన్కి రావాలంటే ఆవుద్ధరిణే వుండాలట్రా! పెద్ద ఫోటో గదిలో పెట్టుకొన్నావ్ చాలదూ! నేనే అలా చెయ్యమన్నా! పార్వతినేమీ అనకు!" కొడుకుని శాంతపర్చాలని ప్రయత్నించింది అనసూయమ్మ.

"పదితులాల పంచపాత్రను చెరిపించి మేనల్లుని అన్న ప్రాసనకి వెండిగిన్నె చేయించినప్పుడు ఏమీ అనలేదు! బోడి చెంచాకు యింత రభస చేస్తారకుకోలేదు. అర్నెల్ల బట్టీ పట్టు వరికిణీ కావాలని పేచీ పెడ్తాంటే కుట్టించలేదుగానీ

వందరూపాయిలు పెట్టి పట్టీలు చేయిస్తారట!" భర్తమీద విరుచుకుపడింది పార్వతి. సహనంతో మౌనం వహించాడు భాస్కరం.

అవును! పార్వతి అన్న మాట నిజమే! దెప్పుగా అంది కాబట్టి సహించలేకుండా వున్నాడు. ఆగ్రహం వస్తోంది తన కొడిక్కి అన్న ప్రాసన ముహూర్తం పెట్టి అకస్మాత్తుగా రమ్మని ఆహ్వానించింది చెల్లెలు. ఆమెకు ముగ్గురాడ పిల్లల తర్వాత కొడుకు పుట్టాడు. తనకెప్పుడూ డబ్బుకిబ్బందే! నలుగురు పిల్లల్తో చిన్న జీతంతో సంసారం చేయాలి. ఆ రోజు ఏమి చేయాలో తోచక ఆలోచిస్తూ వుంటే తల్లే సూచించింది.

"బాబూ ఆలోచనెందుకు? నీ చెల్లెలు తన కొడుక్కి మీ నాన్న గారి పేరు పెట్టుకొంది. మీ నాన్న గారి సంపాదన ఆ వెండి పంచపాత్రా వుద్ధరణీ మిగిలాయ్. పంచ పాత్ర పది తులాలుంటుంది. దాన్ని చెరిపించి వెండిగిన్నె చేయించి చదివించు. తన మనవడికి తన ఆర్జన ముట్టిందని మీ నాన్నగారి ఆత్మ సంతోషిస్తుంది. మనవుడు పుడ్తే వెండి కంచం చేయిస్తానని మీ నాన్నగారు నీ చెల్లిలితో అనేవారు. వెండి గిన్నైనా యిచ్చి తృప్తి పడదాం!"

అప్పుచేసి ఏదైనా చేయాలనుకొన్న భాస్కరానికి తల్లి సూచన నచ్చింది. పంచపాత్రని చెరిపించాడు. సకుటుంబగా వెళ్ళి నలుగురిలోనూ ఘనంగా వెండిగిన్నె చదివించాడు. రోహిణి తండ్రి ఒడిలోంచి దిగి కుర్చీచుట్టూ తిరిగి నాన్నగారూ పట్టీలు బాగులేవా? ఘల్లు ఘల్లుమంటున్నాయ్ అడిగింది అమాయకంగా. భాస్కరం పెదవిపై చిరునవ్వు తొణికిన లాఢ్డంతో అత్తా కోడళ్ళు మనసులు తేలిక పడ్డాయ్.

"చాలా బావున్నాయ్ తల్లీ!" అంటూ కూతుర్ని తిరిగి ఒడిలోకి తీసుకున్నాడు భాస్కరం.

రాత్రి భోజనానికి పీటలమీద కూర్చుని "అమ్మా!" తల్లిని కేకేశాడు భాస్కరం.

రోహిణిని నిద్రపుచ్చుతున్నారు!" భర్తకు అన్నంవడ్డిస్తూ చెప్పింది పార్వతి.

"ఏం బాబూ పిల్చావా!" వంటిట్లో ప్రవేశిస్తూ అడిగింది అనసూయమ్మ.

"అవునమ్మా! రోహిణి పడుకుందా?"

తనయని పక్కనే కూర్చొని "పడుకొందిరా! దానిది అచ్చం నీ పోలికే! పడుకొనే ముందు కథ చెప్పమని పేచీ పెడ్తుంది. తీరా మొదలు పెట్టేసరికి నిద్రపోతుంది!" అంది.

"వచ్చే పద్నాలుగో తారీఖున తిరుపతి ప్రయాణం పెట్టానమ్మా" చెప్పాడు భాస్కరం.

"చాలా సంతోషం బాబూ! పెద్ద కొడుకు పుట్టినప్పుడు మొక్కుకొన్న మొక్కు! వాడికి పదిహేనేళ్ళొచ్చాయి! చాలా ఆలస్యం చేసావ్! నలుగురు పిల్లల తండ్రి వయ్యావ్. ఇంత సంసారంతో వెళ్ళి మొక్కు తీర్చుకోవాలంటే ఎంత ఖర్చు! వడ్డితో సహా తన మొక్కు తీర్చుకొనేలా చేస్తాడా వడ్డి కాసులవాడు! డబ్బుకి డబ్బు వడ్డీ అయితే సంతానానికి సంతానం వడ్డి! పోనీ యిప్పటికైనా ఆ ఏడుకొండల వానికి అనుగ్రహం కల్గింది!" సంతోషించింది అనసూయమ్మ.

"మొక్కులు తీర్చుకొనే శక్తి లేనప్పుడు మొక్కుకోవడం మానుకోవాలి!" వ్యాఖ్యానించింది పార్వతి.

కోడలు మాటలు అనసూయమ్మకు చికాకు పెట్టాయ్.

"అదేమిటమ్మా అలా అంటావ్! ఆ భగవద్దర్శనం ప్రాప్తం అయ్యేంతవరకూ మనంఎన్ని ప్రయత్నాలు చేసినా ఏదో ఒక ఆటంకం వస్తూనే ఉంటుంది!" అంది.

"మన ప్రయాణానికి బెర్తులు రిజర్వు చేయించానమ్మా!" చెప్పాడు భాస్కరం.

చాల మంచి పని చేశావు బాబూ! మూర్తిబాబు పెళ్ళాం మళ్లీ నెల తప్పిందట! చంకలో పిల్లాడితో చేసుకోలేకపోతుందట. ప్లీడరుగారి పెద్దమ్మాయి పెద్దాపురంనుంచి నిన్ననే వచ్చింది. చెప్పింది. మీరు తిరిగివచ్చేవరకూ మూర్తిబాబు దగ్గరుంటా. దార్లో సామర్లకోటలో నన్ను దింపేయ్. స్టేషనుకి రమ్మని నీ తమ్మునికి ఉత్తరం రాయి.!"

"లేదమ్మా! నీక్కూడా టికెట్ రిజర్వు చేయించా! మనం అందరం కలసి అలా కన్యాకుమారి వరకూ వెళదాం!"

భర్త మాటలకు ఆనందం పొందింది పార్వతి. అమితానందం పొందింది అనసూయమ్మ.

"అవునత్తయ్యగారూ! మీరు కూడా రావాలి!" అంది పార్వతి. కొడుకూ, కోడలూ ప్రేమానురాగాల్తో ఆహ్వానిస్తుంటే ఆనందార్ణవంతో మునిగి తేలింది అనసూయమ్మ. అయినా మొహమాట పడింది.

"ఎందుకు బాబూ! మనిషికి మనిషి తోడైతే బోలెడు ఖర్చు! మీరెళ్లి రండి! ఆ భగవదనుగ్రహం నాకింకా కల్గలేదు!"

"లేదమ్మా! నువ్వూ రావాలి! యాత్రాస్థలాలను చూడ్డానికి వెళ్లినప్పుడు రైలు ఖర్చుల్ని నాలుగేళ్లకోసారి ప్రభుత్వం భరిస్తుంది..... పై ఖర్చులు పెట్టుకొంటే చాలు! అందరవూ కల్సి వెళదాం! కాదనకు!" పట్టు బడ్డాడు భాస్కరం.

"మీరు వచ్చి తీరాలత్తయ్యగారూ! పిల్లల్తో నేను సాగలేను! కావేరీలో పుష్కర స్నానం చేద్దాం!" అంది పార్వతి.

కొడుకూ, కోడలూ దైవ దర్శనానికి రమ్మని అప్యాయంగా ఆహ్వానిస్తూంటే వారి అనురాగానికి ముగ్ధురాలైంది అనసూయమ్మ. కానీ మరుక్షణంలో ఆమె మొహం వివర్ణమైంది. తన భర్త ఏడుకొండలవాని దర్శనం చేసుకొంటానని యిరవై సంవత్సరాల క్రితం మొక్కు కొన్నాడు. ఆ మొక్కు చెల్లకుండానే అతనికాలం చెల్లింది. భర్తతో పసుపు కుంకుమతో ఆ భగవంతుని దర్శించే మహా భాగ్యం తనకుదక్కలేదు. కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ముప్పయి ఐదు సంవత్సరాలు కలసి జీవించిన భర్త తనను ఏకాకిని చేసి వెళ్ళిపోయాడు. ముత్తైదువుగా భర్తకన్నా ముందు పోయే భాగ్యం ప్రసాదించమని అనునిత్యం ఆ భగవంతుని ప్రార్థించేది. తన మొర వినలేదా వెంకటేశ్వరుడు ఇప్పుడు ఒంటరిగా దైవ దర్శనానికి వెళ్ళాలి. ఆమె కళ్ళు చెమర్చాయి... ఎదురుగా భర్త లీలగా కన్పించి "వెళ్ళిరా!" అని అనుజ్ఞ యిచ్చినట్లు తోచింది. కొంగుతో కళ్లు తుడుచుకొంది.

"ఏమ్మా? అలావున్నా వేం?" కంగారుగా అడిగాడు భాస్కరం.

"చెప్పండత్తయ్యా, ఏమిటలా అయిపోయారు?" ఆతృతగా అడిగింది పార్వతి.

"ఏం లేదమ్మా! మీ మావగారికొకప్పుడు పెద్ద జబ్బు చేసింది. తిరుపతి

వచ్చి నీ దర్శనం చేసుకొంటామని అనాడు మొక్కుకొన్నాం. ఆ మొక్కుతీరకుండానే తన తనువు చాలించు కొన్నారు మీ మావగారు! వారులేకుండా యిలా వంటరిగా వెళ్ళాల్సి వస్తుందని ఎప్పుడూ ఊహించుకోలేదమ్మా."

దుఃఖాన్ని ఆపుకోలేక పోయింది ఆమె.

ఆమె పరిస్థితికి ఆ యిద్దరూ భాధపడ్డారు.

"అవునమ్మా! నీ వన్నట్లు నాన్నగారికి భగవదనుగ్రహం కలుగలేదు. మనం ఏం చేయగలం!"

"ఇతర ఆలోచనలు పెట్టుకొని మనసు పాడు చేసుకోకండత్తయ్యా. మీరు కూడా వచ్చి తీరాల్సిందే. మావగారెప్పుడో భగవంతుని సన్నిధిని చేరుకొన్నారు! ఊరడించాలని ప్రయత్నించింది పార్వతి.

"సరే బాబూ! అలాగే వెళదాం!" అని అనసూయమ్మ అనడంతో ఆ దంపతులు తృప్తి పడ్డారు.

ప్రయాణం మూడు రోజులుండనగా ఆ యింట్లో హడావిడి ఎక్కువకాసాగింది. దారిలో తినడానికి పూరీలూ, జంతికలూ, చేగోడీలూ చేశారు అత్తా కోడళ్ళు. పిల్లల హడావిడి మరీ ఎక్కువైంది. తమ స్నేహితులందరితోనూ చెప్పి వచ్చారు. మర్నాడుదయం ప్రయాణం సామాన్లూ బట్టలూ సర్దుకోవడం అయింది. సామాన్ల సంఖ్య అతి తక్కువగా వుండాలని భాస్కరం ఎంత హెచ్చరించినా తగ్గలేదు. సర్దిందే మళ్ళీ సర్దడం.......... ఆ రాత్రి మూలనున్న కర్రపెట్టిని ముందుకు లాగి అందుకొని సామాన్లని ఒక్కొక్కటీ బయటకు తీసి వెతకడం ప్రారంభించాడు భాస్కరం. తాను వెతుకుతున్న వస్తువు ఎక్కడా కనబడక పోవడంతో సామాన్లన్నింటినీ చిందరవందరచేసాడు. చీకాకు ఎక్కువైంది.

"ఏవిటండీ సామాన్లన్నీ అలా బయట పారేస్తున్నారు. మళ్ళీ ఎవరు సర్దుతారు?" గదిలో ప్రవేశిస్తూ విసుక్కొంది పార్వతి. భర్త మాట్లాడకపోవడంతో

"ఏం కావాలండీ?" మళ్ళీ అడిగింది.

మొహానికి పట్టిన చెమటను పై మీద తువ్వాల్తో తుడుచుకొన్నాడు భాస్కరం.

"నాన్నగారి తిరుపతి మొక్కు వెండికడియం వుండాలి! కనబడ్డం లేదు!" అన్నాడు.

భర్త మాటలకి గతుక్కుమంది పార్వతి.

"అదా!" అని ఆగింది.

తలెత్తి భార్య వంక చూసాడు భాస్కరం.

"తీసావా?"

"ఆ!"

"ఏది? ఎక్కడపెట్టావ్? ఇలాతే! హుండిలో వేయాలి!" లేచి నుంచున్నాడు భాస్కరం.

"లేదు!" అంది పొడిగా.

భార్య జవాబుకి గతుక్కుమన్నాడు.

"లేదా? ఏమైంది?"

"నాలుగు తులాలైనా వుంటే బాగుండదని అందరూ అంటే దాన్ని కూడా చెరిపించి మన రోహిణి పట్టీలు మీది వేసానండి!" నానుస్తూ భయంగా చెప్పింది.

నిశ్చేష్టుడయ్యాడు భాస్కరం.

❖ ❖ ❖ ❖ ❖

భాస్కరం తండ్రి పార్థసారథిగారు ఎలిమెంటరీ స్కూలు హెడ్మాష్టరు. నలుగురు మగపిల్లలూ యిద్దరాడ పిల్లలూ సంతానం. పెద్దవాడు భాస్కరం, ఆ రోజుల్లో పార్థసారథిగారి జీతం వంద రూపాయలకి మించి వుండేది కాదు. సంసారం గడవడం కష్టంగా వుండేది. అయిదు మైళ్ళు దూరంలో వున్న తుని హైస్కూల్లో

పిల్లల్ని చదివించారు. భాస్కరం మంచి మార్కుల్తో ఎస్సెల్సీ పాసయ్యాడు. కాలేజీలో చేరుతానన్నాడు. తండ్రి వద్దన్నాడు. ఆర్థిక పరిస్థితి బాగులేదన్నారు. కాలేజీలో చేరుతానని రెండు నెలలు పేచీపెట్టాడు భాస్కరం. నాన్నగారు మరో రెండు సంవత్సరాల్లో రిటైర్ కాబోతున్నారనీ తన కాలేజీ చదువు పూర్తికాదనీ, మధ్యలో ఆపేయాల్సి వస్తుందనీ తండ్రి రిటైర్ అయేలోగా ఉద్యోగం సంపాదించుకొని సంసారాన్ని ఈద్చే బాధ్యత చేపట్టాలనీ నచ్చ చెప్పింది తల్లి. తన కోరికను చంపుకొని ఉద్యోగాన్వేషణ ప్రారంభించాడు భాస్కరం. పెద్ద మార్కులతో పాసవడంవల్ల టెలిగ్రాఫ్ డిపార్టుమెంటులో ఏ కష్టం లేకుండా గుమాస్తా ఉద్యోగం లభించింది. భాస్కరం ఉద్యోగంలోచేరిన సంవత్సరానికే తండ్రిరిటైర్ అయ్యాడు. ఆ సంసారాన్ని పోషించే బాధ్యత భాస్కరంమీద పడింది. సర్వీసులో వుండగానే పెద్ద కుతురికి పెళ్ళి చేశారు పార్థసారథిగారు. ఆఖరున అమ్మాయి పుట్టింది. ఆమె పెళ్ళికి అంత తొందరలేకపోయినా ఆ పెళ్ళి జరిపించే బాధ్యత బాస్కరానిదే. అందరూ విశాఖపట్నం చేరుకొన్నారు. కాలేజీవున్న పట్నంకాబట్టి తమ్ముళ్ళకి కాలేజీ చదువులు చెప్పించాడు. వాళ్లందరికి ఉద్యోగాలు అయ్యాయ్. ఆఖరి చెల్లికి అన్నదమ్ములందరూ సమిష్టిగా పెళ్ళి చేసారు. ఇప్పుడు ఎవరి సంసారాలు వాళ్ళవి. విశాఖపట్నం వెళ్ళిన సంవత్సరానికే పార్థసారథిగారు పోయారు. పెద్దబ్బాయి పెళ్ళి మాత్రమే చూడగలిగారు.

అందరిని ప్రయోజకుల్ని చేసేసరికి భాస్కరానికి సగం సర్వీసు అయింది. నలుగురు పిల్లలు పుట్టారు. ఆర్థిక స్థితి అధ్వానం అయింది.

అతనికి బాగా గుర్తు తండ్రి టైఫైడ్ వచ్చి తగ్గి, మళ్ళీ తిరగబెట్టింది. బ్రతుకుతాడని ఆశ లేదు. డాక్టరు కూడా పెదవి విరిచాడు. అప్పుడు తల్లి మొక్కుకుంది. భర్తతో తిరుపతి వచ్చి నీ దర్శనం చేసుకొంటానని, భర్తకు కుడిచేతికి వెండి కడియం వేయించింది. తానే వెళ్ళి చేయించి తెచ్చాడు. అప్పుడు తనకిపదిహేను సంవత్సరాలు. వారి మొరలాలకించాడు ఏడుకొండలవాడు. పార్థసారథిగారు బతికి బయటపడ్డారు. తండ్రిచేతిని కడియం అలాగే వుండిపోయింది. మొక్కు చెల్లించుకొనే శక్తి లేక పోయింది.

భాస్కరం పినమామగార్కి మద్రాసులో వుద్యోగం. పెళ్ళయిన కొత్తలో వండక్కిరమ్మని ఆహ్వానించారు. భార్యతో బయలుదేరా్త, తల్లినీతండ్రినీ కూడారమ్మన్నాడు. అక్కడికి తిరుపతి దగ్గరేకాబట్టి మ్రొక్కు తీర్చుకోవచ్చు నన్నాడు.

"కొత్త దంపతులు! మీతో మేం ఎందుకు? హాయిగా మద్రాసూ అవీ తిరిగి రండి! మరోసారి వెళ్దాం." అన్నారు పార్ధసారధిగారు. తల్లిని బ్రతిమాలాడు భాస్కరం. ఆమెకూడా అలానే అంది. ఆనాడు అవకాశాన్ని చేజేతులావదులు కొన్నారు. ఆయనగతించి అయిదేళ్ళయింది. మ్రొక్కు తీరకుండానే గతించారు పార్ధసారధిగారు.

ఆరోజు ఆ సంఘటన తనకింకా కళ్ళముందుకదలాడ్తూవుంటుంది తండ్రి శవాన్ని కట్టెలమీద వుంచారు. శరీరంమీద ఒక్క నూలుపోగు కూడా లేకుండా తొలిగించారు. మనిషి ఎలాపుట్టాడో అలాగే దహన పరచబడాలన్నారు అపర కర్మలు చేయించే వెంకయ్యగారు.. తండ్రి శవం మీద పుల్లలు పేరుస్తూంటే నీరు నిండిన కళ్ళతో ఆ బొందెను ఆఖరిసారిగా చూసాడు.

"ఆగండి!" అని కేక వేశాడు.

అంతా ఆశ్చర్యంగా అతని వైపు చూశారు.

"ఏం బాబూ!" అడిగారు వెంకయ్యగారు.

"నాన్నగారి చేతికి వెండి కడియం ఉండిపోయింది." అన్నాడు చితికి దగ్గరగా నడుస్తూ.

"ఇంకెక్కడి నాన్నగారు బాబూ! అది వారి బొంది మాత్రవేం! భార్యాపిల్లలు-అన్న మమకారాలకి అతీతులు!" అన్నారు వెంకయ్యగారు.

"అది కాదండి! అది వారి మొక్కుబడి కడియం. దాన్ని బయటకు తీయించండి! వారి మొక్కును నేను తీరుస్తా!" అన్నాడు భాస్కరం.

పిచ్చివాణ్ణి చూసినట్లుగా చూశారు వెంకయ్యగారు.

"మీ నాన్నగారి ఆత్మ ఎప్పుడో భగవత్సన్నిధిని చేరుకొంది బాబూ! ఇక

మొక్కుబడులతో నిమిత్తంలేదు. దాన్ని కూడా ఆ బొందితోనే భస్మంగానీ!"

భాస్కరం ఒప్పుకోలేదు. అతనితో వాదించి లాభంలేదని గ్రహించారు వెంకయ్యగారు. వేసిన కట్లను తొలగించి కడియాన్ని తీయించి భాస్కరానికి అందించాడు. ఆ కడియాన్ని జాగ్రత్తగా దాచాడు భాస్కరం. అది ఇప్పుడు లేదు. తండ్రి మొక్కును తాను తీర్చలేదు. మనసు బాధ పడింది. అర్ధాంగి మీద అమితమైన ఆగ్రహం వచ్చింది. పోయిన కడియం ఎలాగూ తిరిగి రాదు. నిగ్రహించుకొని ఆగ్రహాన్ని దిగమింగుకొన్నాడు అతి కష్టం మీద.

"ఊ! సరేలే!" అన్నాడు బరువుగా.

ఏ తుఫాను చెలరేగుతుందోనని భయపడ్డ పార్వతి తేలిగ్గా నిట్టూర్పు విడిచింది.

శుక్రవారం రాత్రి ఎనిమిది గంటలకల్లా ఎగువ తిరుపతి చేరుకొన్నారు. కాటేజిని బుక్ చేశాడు భాస్కరం. వారి అదృష్టంకొద్దీ పుష్కరిణి కెదురుగా గుడికి దగ్గరగా దొరికింది. తెల్లవారుఝామున నాలుగ్గంటల కల్లా వెళ్తే భక్తుల క్యూ అంత పెద్దదిగా ఉండదని ఎవరో చెప్పారు. నాలుగ్గంటలకి ముందుగానే వెళ్లాలని నిశ్చయించుకొన్నారు. ప్రయాణపు బడలికవల్ల తల్లీ, భార్యా పిల్లలు ఆదమరిచి నిద్రపోయారు. భాస్కరానికి మాత్రం నిద్ర రాలేదు. పెళ్లాన్ని లేపి తలుపు వేసుకోమని చాపతో వీధి అరుగు మీదకు వచ్చాడు.

ఎదురుగా వెంకటేశ్వరుని గుడిగోపురం రంగురంగుల దీపాలతో కాంతులను విరజిమ్ముతోంది. ఆ గోపురాన్ని చూస్తే చాలు భక్తిభావం పుట్టుకొస్తుంది. భగవంతుని విగ్రహం లీలామాత్రంగా దర్శనమిస్తుంది. ఎప్పుడు దర్శించి తరిద్దామా అని ఎద తొందరచేస్తుంది. చాప వేసుకొని కూర్చున్నాడు భాస్కరం. అతనికి ఒకటే విచారం. తండ్రి మొక్కుతీర్చలేని తనయుడు తాను. అవకాశం వచ్చికూడా ముడుపు చెల్లించలేని పుత్రుడు. ఆ కడియానికి బదులుగా వంద రూపాయలు హుండీలో వేసినా మ్రొక్కు చెల్లించానన్న తృప్తి ఉండదు. నిద్ర రాక ఆ గోపురాన్ని దర్శిస్తూ ఎంతో కాలం గడిపాడు. ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీదు.

రెండు గంటలకల్లా అత్తా కోడళ్లిద్దరూ లేచారు. పిల్లల్ని లేపారు. పుష్కరణిలో స్నానానికి బయలుదేరారు. గదికి తాళం వేసి భాస్కరాన్ని లేపారు. నిద్రపోతున్న రోహిణిని భర్త పక్కలో పరుండబెట్టింది పార్వతి.

"పిల్లలూ, మేము స్నానం చేసివస్తాం. మేం వచ్చాక మీరూ రోహిణి వెళుదురుగాని". అంటూ భర్త చేతికి గది తాళాలు అందించింది పార్వతి. తాళాలు అందుకొన్నాడు భాస్కరం. నాలుగడుగులు వేసి వెనక్కువచ్చి భర్తను మరోసారి హెచ్చరించింది. "తాళాలు జాగ్రత్త! రోహిణి కాళ్లకు పట్టీలున్నాయ్, నిద్రపోకండి!"

తల్లీ భార్యపిల్లలూ వెళుతున్న వైపే చూస్తూ ఉండిపోయాడు భాస్కరం. నిద్ర మత్తులో రోహిణి తన కాళ్లను తండ్రి ఒడిలో పెట్టింది. పట్టీలకున్న మువ్వలు ఘల్లుమన్నాయ్. పట్టీలను చేత్తో తడిమాడు భాస్కరం.

ఎంత పిచ్చివాడు తను. తండ్రి మ్రొక్కుబడి కడియం అదే. ఆ కడియమే చెరిపించబడి ఆకారం మార్చబడింది. వడ్డికాసులవాడు సార్థక నాముడు. వడ్డితో సహా తన మ్రొక్కు చెల్లింపబడేలా చూస్తాడు. తులం కడియం నాలుగు తులాలుగా వృద్ధిపొందింది. తన తల్లి అన్నట్లు డబ్బుకి డబ్బూ, సంతానానికి సంతానం వడ్డీ అయినట్టు వెండికి వెండి వడ్డి. అసలు వడ్డీలు కలిసి నాలుగు తులాలు.

నాలుగ్గంటలయ్యేసరికి అంతా ఆలయప్రాంగణంలోకి అడుగుబెట్టారు. భక్తుల క్యూ ఉన్నా అంత పెద్దదిగాలేదు. కొంతసేపు తనతో ఉంచుకొని కూతుర్ని భర్తకు అందించింది పార్వతి. కూతుర్ని భుజాన వేసుకొన్నాడు భాస్కరం. పదేసి రూపాయి కాసుల్ని పొట్లాలుగా కట్టి ఒక్కొక్కరికి ఒక్కో పొట్లాం అందించాడు హుండీలో వేయమని, భాస్కరం ఒక పొట్లాన్ని అదనంగా వేసి తండ్రి మ్రొక్కు చెల్లించాడు.

దైవదర్శనం ముగించుకొని తెలతెలవారుతుండగా కాటేజీ చేరుకొన్నారు.భుజం మీద నిద్రపోతున్న కూతుర్ని క్రిందికి దించి తాళంతీశాడు భాస్కరం. కూతురి పాదాలు పట్టీలు లేకుండా బోసిగా ఉండటం చూసి గొల్లుమంది పార్వతి.

"అయ్యో! పిల్ల పట్టీలు పోయాయండి!"

"ఎలా పోతాయే, గదిలో పక్కలో పడిపోయాయేమో చూడు!" అంది అనసూయమ్మ కంగారు పడ్తూ.

"క్యూలో మీ అబ్బాయిగారికి అందించినప్పుడున్నాయండి. ఎవరో కాజేశారు. అసలే వదులుగా ఉన్నాయి. వంద రూపాయలు. ముచ్చటపడితే చేయించా! రెండు వారాలుకూడా కాలేదు!"

రాగాలు తీయనారంభించింది.

తనయుడు ఏమీ మాట్లాడక పోవడంతో అడిగింది అనసూయమ్మ.

"ఏరా బాబూ! పట్టీలు తీసి దాచావా!"

"అవి మనవి కావు! మనసుంచి పోయాయి! అదీ ఒక మ్రొక్కుబడే! తీరిందనుకొన్నాం!" అని నిశ్చింతగా వేదాంతిలా భర్త అంటుంటే అచ్చెరువొందింది పార్వతి.

"మీకేం! దాని హంగు పోయిందని నేనేడుస్తూంటే! మళ్లీ చేయించుకోవాలంటే ఎన్ని జన్మలెత్తాలి!"

"అక్కర్లేదు పార్వతీ! ఈ జన్మలోనే ఈ రోజే కొండ దిగ్గానే ఇక్కడే కొంటా! సరా!" అని భర్త భరోసా ఇవ్వడంతో రాగాలు కట్టింది పార్వతి.

ఆ సాయంత్రం సరిక్రొత్త డిజైన్‌లో కొత్త పట్టీలను కొంది.